

నేడు కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల మహాధర్నా

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: రాష్ట్ర ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం మంగళవారం కలెక్టరేట్ వద్ద జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో జేఏసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ, ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి పాల్గొంటారని, ఉమ్మడి జిల్లాలోని ఉద్యోగులు మహాధర్నాకు తరలిరావాలని వారు పిలుపు నిచ్చారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి

హేయమైన చర్య

- వైసీపీ మూకల దాష్టీకానికి పరాకాష్ట
- అత్యంత దారుణంగా దాడి చేసినా నిందితులను పట్టుకోని పోలీసులు
- జిల్లావ్యాప్తంగా జర్నలిస్టుల నిరసనలు
- మద్దతు తెలిపిన అఖిలపక్షం, ప్రజా సంఘాలు
- కలెక్టరు, తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేత

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు..



అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధిలాగా సేవలందిస్తున్న పాత్రికేయులను టార్గెట్‌గా ఎంచుకుని దాడులకు తెగబడుతున్న తీరు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ప్రజాస్వామ్యాన్ని బతికించే నాలుగు స్తంభాల్లో ఒకటైన పత్రికారంగాన్ని వైసీపీ ప్రభుత్వం తొక్కిపాతరేయాలనుకోవడం దుర్మార్గం. మనం ప్రజాస్వామ్యంలో ఉన్నామా లేక ఆటవిక రాజ్యంలో ఉన్నామా అనే అనుమానం కలుగుతోంది. వైసీపీ పాలనలో ఐదు సంవత్సరాలుగా సాగుతున్న అవినీతి, అరాచకాలు, దోపిడీలు, దురాగతాలతో జనం విసిగిపోయి ఉన్నారు. ప్రజల నాడిని పసిగట్టిన జగన్‌రెడ్డి ఓటమి భయంతో సహనం కోల్పోతూ సిద్ధం సభలలో పచ్చి అబద్ధాలు వల్లెవేస్తున్నారు.

- ఆర్.శ్రీనివాసరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

వైసీపీ పాలనలో పాత్రికేయులకు రక్షణ కరువు



వైసీపీ ప్రభుత్వం పాలన చేపట్టిన నాటి నుంచి పాత్రికేయులకు రక్షణ లేకుండా పోయింది. సాక్షాత్తు ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సభలోనే పత్రికా ఫొటోగ్రాఫర్‌ను వైసీపీ గూండాలు రౌండప్ చేసి ఇష్టానుసారంగా కాళ్లతో తన్నుతూ చేతులతో పిడిగుద్దులు కురిపించడం దారుణం. వైసీపీ పాలనలో పాత్రికేయులుగా పనిచేసే వారికి అక్రిడేషన్‌లు గానీ ఇంటి స్థలం కూడా ఇవ్వలేకపోయారు. కరోనాతో చనిపోయిన పాత్రికేయులకు 5లక్షలు ఇస్తామని చెప్పి జీ.వో ఇచ్చికూడా ఎగనామం పెట్టారు. మంచి చేయక పోయినా ఫర్వాలేదుకానీ పాత్రికేయులకు ప్రాణహాని లేకుండా మా విధులు నిర్వహించుకునే స్వేచ్ఛాయుత వాతావరణం కలిగించేలా చూడాలి.

- రామసుబ్బారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు

అమానుష చర్య.



ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు సిద్ధం సభలోనే దాడి చేయడం అమానుష చర్య. ఓటమి భయంతో జగన్‌రెడ్డి విచక్షణ కోల్పోయి సభను కవర్ చేయడానికి వచ్చిన ఫొటోగ్రాఫర్‌పై ఆ పార్టీ అల్లరిమూకతో దాడిచేయించడం బాధాకరం. అసలు వైసీపీ పుట్టిందే కుట్రపూరితం. వైసీపీ దుర్మార్గాలను ఎత్తిచూపుతున్న పాత్రికేయులను, ఫొటోగ్రాఫర్లను భయభ్రాంతులకు గురిచేసేలా చేయడం సరైందికాదు. పోలీసుల కనుసన్నల్లో ఫొటోగ్రాఫర్‌పై దాడి జరగడం బాధాకరం.

- గాలి చంద్ర, సీపీఐ జిల్లా కార్యదర్శి

వైసీపీ అనుబంధం సంఘంలా పోలీసు వ్యవస్థ



రౌడీ ఇజాన్ని, గూండా ఇజాన్ని ప్రోత్సహించడాన్ని వైసీపీ ప్రభుత్వం మానుకోవాలి. ఇప్పటికే జగన్‌రెడ్డి ఓటమి భయంతో తీవ్ర నైరాశ్యంతో రగిలిపోతున్నాడు. ఆ కోవలో మీడియా ప్రతినిధులపై దాడులు చేసేలా వైసీపీ అల్లరిమూకను ప్రేరేపించడం పద్ధతిగా లేదు. పోలీస్ వ్యవస్థను వైసీపీ అనుబంధ సంఘంగా మార్చారు. ఫొటోగ్రాఫర్‌పై దాడిచేసిన వైసీపీ గూండాలను తక్షణమే అరెస్టు చేయాలి. లేదంటే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారు.

- ఎన్.రవిశంకర్‌రెడ్డి, ఆర్‌సీపీ నేత

పాత్రికేయులకు బాసటగా వుంటాం..



ప్రజాస్వామ్య పరిరక్షణకోసం పాటుపడుతున్న పాత్రికేయులకు బాసటగా ఉంటాం. ప్రతి వ్యక్తికీ ప్రకటనా స్వేచ్ఛ ఉంటుంది. ఆ స్వేచ్ఛను హరించాలనుకోవడం పద్ధతి కాదు. మరికొద్ది రోజుల్లో వైసీపీ అరాచకపాలనకు ప్రజలే మంగళం పలకనున్నారు.

- గుర్రప్ప, న్యాయవాది, రైతు రాజ్యం పార్టీ

దేనికి సిద్ధం..

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడానికా..
పత్రికా స్వేచ్ఛను హరించడానికా..?
రాజ్యాంగాన్ని తుంగలో తొక్కడానికా..?

దేనికి సిద్ధం..

ప్రశ్నించేవారిని అణగదొక్కడానికా..
పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేయడానికా..
నియంతలా పాలన చేయడానికా..?

దేనికి సిద్ధం..

పన్నుల భారం మోపేందుకా..
ఆర్టీసీ, విద్యుత్, పెట్రో చార్జీలు పెంచేందుకా..
ప్రజల ఆస్తులు బలవంతంగా లాక్కునేందుకా..?

మేమూ సిద్ధమే..

మీ అరాచకాలను ప్రశ్నిస్తాం.. మీరు ఉన్మాదంగా ప్రవర్తించి మనుషులను మట్టుబెట్టేరీతిలో భౌతిక దాడి చేసినా బెదరం.. మీ దుర్మార్గాలను తేటతెల్లం చేసేందుకు.. మీ నిర్లజ్జ నిర్భీతిని ప్రశ్నించేందుకు మేమూ సిద్ధమే..!



వైసీపీ మూకల దాడిలో గాయపడిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ (ఫైల్)



ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ఆందోళన

(కడప-ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ కవరేజీ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు అత్యంత పాశవికంగా దాడి చేయడం హేయ మైన చర్య అని జర్నలిస్టు సంఘాలు, అఖిలపక్ష నేత లు పేర్కొన్నారు. వైసీపీ మూకలు మానవమృగాల్లా మారి ఫొటోగ్రాఫర్‌ను అత్యంత దారుణంగా కట్టెలతో కొట్టి, కాళ్లతో తన్ని అంతమొందించేందుకు ప్రయత్నిం చడం ప్రజాస్వామ్యానికే ముప్పులాంటి ఘటన అన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ విపక్ష నాయకులు, జర్నలిస్టు సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీక్రిష్ణపై దాడిని నిరసిస్తూ సోమవారం జిల్లా వ్యాప్తంగా ఏపీయూ డబ్ల్యూజే ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాల కు వివిధ జర్నలిస్టు సంఘాల నేతలు హాజరయ్యా రు. ఇక టీడీపీ, జనసేన, కాంగ్రెస్, కమ్యూనిస్టు, విద్యార్థిసంఘాలు, ప్రజా సంఘాల నేతలు దాడిని ఖండిస్తూ జర్నలిస్టుల నిరసనకు మద్దతు తెలిపారు.

కడపలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షు డు రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీ నివాసరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, ఆర్‌సీపీ అ ధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, ఏపీజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షు డు శ్రీనాధరెడ్డి, చిన్నపత్రికల సంఘం అధ్యక్షుడు వెం కటరెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సుంకోజి దేవేంద్రాచారి, బ్యూరో ఇన్‌చార్జి ఆంజనేయులు, ఏబీఎన్ బ్యూరో ఇన్‌చార్జి శ్రీనివాసులు, డెస్క్ ఇన్‌చార్జి కృష్ణమ రాజు, ఇతర ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సిబ్బంది పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావడం లేదని, జగన్ ప్రత్యేక రాజ్యాంగం అమలవుతోందన్నారు. తాను చెప్పిన ప్రకారం నడుచుకోకపోయినా వినకపోయినా సిద్ధం సభ ద్వారా దేన్నికైనా సిద్ధమేనని ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం నిదర్శనమన్నారు. మళ్లీ జగన్ సీఎం అయితే వ్యతిరేక తీర్పులనిచ్చిన కోర్టులపై కూడా కన్నెర్రజే స్తారేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు.

పలు మండలాల్లో..

పులివెందులలో జర్నలిస్టులు రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఖాజీపేటలో ర్యాలీ చేసి ని రసన వ్యక్తం చేశారు. ఒంటిమిట్టలో జర్నలిస్టులు, టీడీ పీ, కమ్యునిస్టు నేతలు వినతిపత్రం అందించారు. చె న్నూరులో జర్నలిస్టులు టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నేతలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేసి తహసీల్దా రుకు వినతిపత్రం అందించారు. పోరుమామిళ్లలో త హసీల్దారుకు వినతిపత్రం అందించారు. కమలాపురం లో, అట్లూరులో తహసీల్దారుకు వినతిపత్రం అందిం చారు. కాశినాయనలో టీడీపీ నాయకులు రితీశ్‌రెడ్డి ఇతర నేతలు, జర్నలిస్టులు కలిసి తహసీల్దారుకు విన తిపత్రం అందించారు. బద్వేలులో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయ ఎదుట ధర్నా చేశారు. అనంతరం తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. కొండాపురం, ముద్దనూరు, మైదుకూరుల లో నిరసన కార్యక్రమాలు చేపట్టి నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తహసీల్దార్లకు వినతిపత్రా లు అందించారు.

పోలీసులు చేతులెత్తేశారు..



ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి జరుగుతున్నా అక్కడ ఉండే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించి చేతులెత్తేయడం బాధాకరం. పాలక ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటే ఒకరకంగా. వ్యతిరేకిస్తే మరో రకంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్న తీరును తక్షణమే మార్చుకోవాలి. శాంతి భద్రతలను కాపాడలేని పోలీసులు సమాజానికి అవసరమా?

- మాలే శివ, జనసేన నేత



పులివెందులలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు



బద్వేలులో తహశీల్దార్ కార్యాలయం ఎదుట పాత్రికేయుల నిరసన

సిద్ధమంటూ ఉన్మాదిలా ప్రవర్తన

సీఎం జగన్‌రెడ్డి ప్రజాస్వామ్యానికి ముప్పు తెచ్చేలా ఎన్నికల ప్రచారానికి సిద్ధం అని పేరు పెట్టి వారి అనుచరుల చేత ఉన్మాదంగా ప్రవర్తిస్తున్నాడని టీడీపీ, వామపక్ష పార్టీల నాయకులు, పాత్రికేయులు పేర్కొన్నారు. మైదుకూరులో నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్, జనసేన ఇన్‌చార్జి మల్లోత్ర, సీపీఎం, సీపీఐ నేతలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తహసీల్దారు నరేంద్రరెడ్డికి వినతి పత్రం అందచేశారు.



మైదుకూరులో ర్యాలీ నిర్వహిస్తున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల నాయకులు

ప్రభుత్వ పెద్దల వైఖరి ప్రమాదకరం

రాష్ట్రంలో ఐదేళ్లుగా జర్నలిస్టులపై బెదిరింపులు, దాడులు పెరిగిపోయాయని ప్రభుత్వంలో ఉండే పెద్దలే జర్నలిస్టులపై దాడులకు ఉసిగొల్పేలా రెచ్చగొడుతూ మాట్లాడటం చాలా ప్రమాదక వైఖరి అని జర్నలిస్టులు, అఖిపక్ష నేతలు పేర్కొన్నారు. ప్రొద్దుటూరులో జర్నలిస్టులు చేపట్టిన నిరసన ర్యాలీకి బీజేపీ, కాంగ్రెస్, టీడీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, విరసంతో పాటు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి. ఆంధ్రజ్యోతి ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు విద్యాసాగర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సీఎం సురేశ్‌నాయుడు, వీఎస్ ముక్తియార్, ప్రవీణ్‌కుమార్‌రెడి, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో ర్యాలీ చేపట్టిన జర్నలిస్టులు, పార్టీ, ప్రజా సంఘాల ప్రతినిధులు

సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలి

జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఏపీయూడబ్ల్యూజే పిలుపు మేరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పాత్రికేయులపై ఎలాంటి భౌతిక దాడులు జరిగినా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో ఏవోకు వినతి పత్రం అందజేశారు. అక్కడి నుంచి స్కూటర్ ర్యాలీగా వెళ్లి డీఎస్పీ యశ్వంత్‌కు వినతి పత్రం అందించారు.



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం ఎదురుగా నిరసన తెలుపుతున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, ప్రజా సంఘాలు

అభివృద్ధి, జగన్ హామీలపై చర్చకు సిద్ధమా

- ప్రశ్నిస్తే అక్రమ కేసులు, భౌతిక దాడులు
- త్వరలో టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు
- జిల్లాలో మెజార్టీస్థానాలు కైవసం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 19: జగన్ ఇచ్చిన హామీలు, అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీకి సవాల్ విసిరారు. ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతూ భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. జిల్లాలో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకుంటామన్నారు. సోమవారం ద్వారకనగర్‌లోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల్లో అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీలు నెరవేర్చలేదని తేల్చి చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో పేదలు సంతోషంగా పండుగ జరుపుకోవాలని పండుగకానుకలు ఇచ్చామన్నారు. రూ.5కే అన్నక్యాంటీన్ ద్వారా పేదల కడుపు నింపింది చంద్రబాబేనని గుర్తు చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక అన్నక్యాంటీన్లను రద్దు చేసి కూల్చివేసి పేదలకు తీరని ద్రోహం చేశారన్నారు. రాయలసీమలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పనులయినా పూర్తి చేశారా అని ప్రశ్నించారు. అబద్ధపు హామీలు ఇచ్చిన జగన్‌ను, ఆ పార్టీ ఎమ్మెల్యేలను రానున్న ఎన్నికల్లో ప్రజలు సాగనంపడం ఖాయమన్నారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మాట్లాడుతూ జగన్ ఐదేళ్లుగా రాష్ట్రానికి ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. దుర్మార్గపాలన సాగించిన ఈ ప్రభుత్వం అంతిమదశలో ఉందన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫరుపై వైసీపీ మూకలు దాడిని తీవ్రంగా ఖండించారు. ఇటువంటి దారుణ సంస్కృతిని వైసీపీ ప్రభుత్వం తీసుకురావడం దుర్మార్గమన్నారు. ఏదైనా ఉంటే యాజమాన్యాలపై కేసులు పెట్టాలి కానీ ఇటువంటి దుర్మార్గ చర్యలకు పాల్పడడం నీచ రాజకీయాలకు తార్కాణమన్నారు. త్వరలో ప్రజలే ఈ ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి, నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి, బెస్త సాధికార కమిటి రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల భద్రత అందరి బాధ్యత : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: రోడ్డు ప్రమాదాలను అరికట్టడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడంతో పాటు తల్లిదండ్రులు కూడా సామాజిక బాధ్యత వహించాలని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా రవాణాశాఖ డీటీసీ మీరాప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల ముగింపు సభకు కలెక్టర్ విజయరామరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జనవరి 10 నుంచి ఫిబ్రవరి 19 వరకు రవాణాశాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించామన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమన్నారు. వాహనాలు నడిపేటపుడు సెల్‌ఫోన్లు వాడడం, హెల్మెట్, సీటు బెల్టు ధరించక పోవడం చట్టరీత్యా నేరమన్నారు. రహదారి భద్రత కోసం కృషి చేసిన అధికారులకు, సంస్థలకు కలెక్టర్ ప్రశంసాపత్రాలను అందజేశారు. అలాగే విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు జ్ఞాపికలను, నగదు బహుమతులను అందజేశారు. రవాణాశాఖ రూపొందించిన రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణపై అవగాహన పెంచే పలు లఘు చిత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వరరావు, మహేశ్వరరెడ్డి, ఆర్టీవో మురళీధర్, ఎంవీఐలు విజయకుమార్, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా అందే అర్జీలకు నాణ్యమైన సత్వర పరిష్కారం అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్‌తో పాటు డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డిప్యూటి కలెక్టర్ శ్రీనివాసులు హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులు అందిన వెంటనే క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, పారదర్శకంగా, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ విజయ రామరాజు

నయనానందకరం.. పుష్పయాగం

- ముగిసిన దేవునికడప బ్రహ్మోత్సవాలు



కడప (కల్చరల్), ఫిబ్రవరి 19: దేవుని కడప లక్ష్మీవేంకటేశ్వరస్వామికి సోమవారం సాయంత్రం పుష్పయాగం నయనానంకరంగా సాగింది. ఈనెల 9వ తేదీన ప్రారంభమైన ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో ముగిశాయి.. కాగా శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఏదేని పొరపాట్లు జరిగివుంటే ఆ దోషాలు తొలగిపోయేందుకు సోమవారం సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం నిర్వహించారు. అంతకు ముందు కడప రాయడుకి సుగంధ పరిమళ పుష్పాలతో అభిషేకం గావించారు. ప్రత్యేక పుష్పాలతో ఆలయంలో వేదికను అలంకరించి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరుని ఆశీనులను గావించారు. వివిధ రంగుల పరిమళ భరితమైన పుష్పాలతో ఆలయ అర్చకులు త్రివిక్రమ్, కృష్ణమోహన్‌ల వేదమంత్రాల నడుమ వైకుంఠవాసునికి పుష్పయాగం నిర్వహించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో సాగిన శ్రీవారి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు పుష్పయాగంతో ముగిశాయి.

సమయం ఇస్తే.. నిబంధనల ప్రకారం అనుమతులు తెచ్చుకుంటాము

● కాశినాయన ఆలయ నిర్వాహకులు



అధికారులతో మాట్లాడుతున్న జ్యోతిక్షేత్ర నిర్వాహకులు

కాశినాయన ఫిబ్రవరి 19: జ్యోతిక్షేత్రంలోని కాశినాయన ఆలయ విషయంలో ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారులు కొంత సమయం ఇస్తే నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తెచ్చుకుంటామని ఆలయ నిర్వాహకులు అధికారులను కోరారు. గత కొంతకాలంగా కేంద్ర రిజర్వు ఫారెస్ట్‌లో కాశినాయన ఆలయాన్ని నిర్మించారని ఫారెస్ట్ అధికారులు అభ్యంతర పెడుతూ ఆలయ నిర్మాణాన్ని అడ్డుకుంటూ నిర్వాహకులకు నోటీసులు ఇస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ప్రొద్దుటూరు డీఎఫ్‌వో ప్రదీప్‌రెడ్డి, బద్వేల్ ఆర్డీవో ఆకుల వెంకటరమణ, పోరుమామిళ్ల సీఐ చిరంజీవి, ఇతర అధికారులు, ఫారెస్ట్, పోలీసు సిబ్బంది జ్యోతిక్షేత్రం చేరుకున్నారు. అటవీ ప్రదేశంలో అనధికారికంగా చేపట్టిన కట్టడాలు ఎంతమేరకు ఉన్నాయో పరిశీలించి వాటిని ఖాళీచేసి వెళ్లిపోవాలని నిర్వాహకులను కోరారు. విషయం తెలుసుకున్న బద్వేల్ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నాయకురాలు విజయమ్మ, వైసీపీ బద్వేల్ అదనపు సమన్వయకర్త ఎన్.విశ్వనాథ్‌రెడ్డి అధికారులతో మాట్లాడారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కాశినాయన భక్తులు లక్షల్లో ఉన్నారని ఈప్రాంత వాసులకు అవధూత కాశిరెడ్డినాయన ఆరాధ్యదైవంగా ఉన్నాడన్నారు. అలాంటి ఆధ్యాత్మిక జ్యోతిక్షేత్రానికి ఆవరోధాలు కలిగించవద్దని కోరారు. భక్తులు మనోభావాలు దెబ్బతింటాయని.. ఈవిషయాన్ని ఉన్నతాధికారులకు తెలియపరచాలని కోరారు. భక్తుల అభ్యంతరాలు రాజకీయ నాయకుల, నిర్వాహకుల వినతి మేరకు విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోయి కొంతసమయం ఇచ్చేలా చూస్తామని చెప్పి అధికారులు వెళ్లిపోయారు.

మిర్చి...నష్టాల ఘాటు



చిన్నకొమెర్ల గ్రామంలో మిర్చిని ఎండబెట్టిన దృశ్యం

● తెగుళ్లతో తగ్గిన దిగుబడులు

● పతనమైన ధరలు

● ఆందోళనలో రైతన్నలు

మైలవరం, ఫిబ్రవరి 19: మిర్చి రైతులకు ఈ ఏడాది కూడా కలిసి రాలేదు. ప్రకృతి ఒడిదుడుకులను ఎదుర్కొని పంట సాగు చేపట్టినా తీవ్ర వర్షాబావం, తెగుళ్ల బెడద రైతులను కుంగదీసింది. ఈ ఏడాది మిర్చి పూత దశలో ఉన్న సమయంలో తీవ్ర వర్షాబావం ఏర్పడటం, పంటకు తెగుళ్ల సోకటంతా తాలు కాయలు వచ్చాయి. వచ్చిన పంటనైనా అమ్ముకుని పెట్టుబడులైనా రాబట్టుకుందా మనుకుంటే సరైన గిట్టుబాటు ధరలు లేవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక సతమతమవుతున్నారు.

పూత దశలో వర్షం లేక...

మండలంలోని కల్లుట్ల, బెస్తవేముల, తొర్రివేముల, నార్జాంపల్లి, చిన్నకొమెర్ల, పొన్నంపల్లి, తదితర పంచాయతీల్లో దాదాపు 3,500 ఎకరాల్లో మిరప పంట సాగు చేశారు. ఈ ఏడాది పూత బాగా వచ్చిందనుకునే సమయంలో సరైన వర్షాలు లేక పోవడంతో కాయ దశ వచ్చేసరిగా దిగుబడి బాగా తగ్గింది. దీంతో తాలు కాయలు ఎక్కువగా రావడంతో పంట దిగుబడి తగ్గి పెట్టిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దిగజారుతున్న ధరలు

ఓ వైపు తెగుళ్ల బెడదతో పంట దిగుబడి తగ్గిపోగా.. మరో వైపు ధరలు కూడా నేల చూపులు చూస్తున్నాయి. గుంటూరు మిర్చి యార్డులలో ధర రోజు రోజుకు పతనమవుతోంది. గత ఏడాది కుబేర రకం మిర్చి క్వింటా రూ.20 వేలు ఉండగా.. ఈ ఏడాది రూ.10-12 వేల మాత్రమే పలుకుతోంది. కోత కూలి ఎకరానికి రూ.40 వేలు, సేద్యాలు 15 వేలు, ఎరువులు, పురుగు మందులకు రూ.50వేలు అన్నీ కలిపి ఎకరాకు లక్ష రూపాయలకు పైగా పెట్టుబడి అవుతోంది. ప్రస్తుతం మిరపలో 7-8 క్వింటాళ్లు మించి రాలేదని.. అవి కూడా తాలు కాయలే ఎక్కువగా వచ్చాయని రైతులు వాపోతున్నారు. ఇక కౌలు రైతుల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. పంట దిగుబడికి తోడు ధరలు కూడా తగ్గడంతో అప్పులపాలయ్యామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



మిరపకాయలను కలాల్లో రాశిగా పోస్తున్న రైతులు



తెగుళ్లు సోకడంతో తాలుకాయలుగా మారిన మిర్చి

కౌలు రైతులను ఆదుకోవాలి



నేను 3 ఎకరాల్లో కౌలుకు తీసుకుని మిర్చి సాగు చేశా. పంటకు సరైన సమయంలో వర్షాలు పడక పోవడం, తెగుళ్ల బెడదతో దిగుబడి తగ్గింది. బోరు నీటితో మిర్చి పంటకు నీరు పెట్టినా వర్షాలు పడినట్లు ఉండదు. గత ఏడాది కంటే మిర్చి క్వింటాకు రూ.5 వేల నుంచి 8 వేల వరకు తగ్గడంతో పెట్టుబడులు రావడం గగనమైంది. కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

- జగన్, రైతు

దిగుబడి బాగా తగ్గింది



గత ఏడాదితో పోల్చితే దిగుబడి చాలా తగ్గింది. ఎకరాకు 200 మనుములు కావాల్సి ఉండగా... ఈఏడాది 100-120 మనుములు మాత్రమే పంట దిగుబడి వస్తోంది. ఓ వైపు పెట్టుబడులు పెరిగి పోగా.. దిగుబడి బాగా తగ్గిపోవడంతో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యాం.

- వెంకటరామిరెడ్డి, రైతు

స్పందన ఫిర్యాదులపై స్పందించండి : ఎస్పీ



బాధితుల సమస్యలపై విచారిస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 19: స్పందన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో స్పందన (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా పరిధిలోని నలుమూలల నుంచి వచ్చిన 52 మంది ఫిర్యా దుదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా జిల్లా ఎస్పీకి అందజేశారు. అనంతరం ఎస్పీ ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం చేకూర్చాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

కళాజాత బృందం ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన



కళాజాత కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న డీయంఅండ్‌హెచ్‌వో

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ఈ నెల 19 నుంచి 29 వరకు కళాజాత బృందాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కొండయ్య తెలిపారు. జిల్లాలో ఎయిడ్స్ నివారణ, నియంత్రణా విభాగం ఆధ్వర్యంలో కళాజాత బృందాలతో వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలను ప్రదర్శిస్తున్న ఆయన తెలిపారు. సోమవారం ఉదయం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కొండయ్య, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ శాఖాధికారి డాక్టర్ పీ. శైలజ, డెమో డాక్టర్ దేవశిరోమణిల ఆధ్వర్యంలో జెండా ఊపి కార్యక్రమాలు ప్రారంభించారు. జిల్లాలో రెండు కళాజాత బృందాలతో హెచ్ఐవీ/ఎయిడ్స్ వ్యాధి, రక్తదానం, సుఖవ్యాధుల కౌన్సెలింగ్ కేంద్రాలు, క్షయవ్యాధుల గురించి వీధి నాటకాల ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్దేశించిన గ్రామాల్లో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

● పెళ్లి అయిన ఐదు నెలలకే ఘటన



కరీముల్లా మృతదేహం



కరీముల్లా (ఫైల్)

మైదుకూరు, ఫిబ్రవరి 19 : ప్రేమించి ఐదు నెలల క్రితం పెళ్లి చేసుకున్న ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతని భార్యకు తీవ్రగాయాలయ్యాయి. ఈసంఘటన సోమవారం రాత్రి స్థానిక బద్వేల్ రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే.. స్థానిక వీణా విజయరాజు కాలనీకి చెందిన షేక్ కరీముల్లా (21) నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన రెహానాను ప్రేమించి ఐదు నెలల క్రితం పెళ్లి చేసుకున్నాడు. సోమవారం తన ద్విచక్రవాహనంలో అత్తగారి ఊరైన ఆత్మకూ రుకు భార్యతో కలసి బయలుదేరి వెళుతుండగా బద్వేలు రోడ్డులోని సబ్‌స్టేషన్ వద్ద బోలోరా పికప్ వాహనం వెనుకవైపు ఢీకొంది. ఈ సంఘటనలో కరీముల్లా అక్కడికక్కడే మృతి చెందగా, భార్య రెహనాకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో కడప ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

స్కూలు వ్యాను బోల్తా.. విద్యార్థులకు గాయాలు



సంఘటనాస్థలంలో బోల్తా పడ్డ వ్యాను

వల్లూరు, ఫిబ్రవరి 19 : మండల పరిధిలోని అంబవరం గ్రామ సమీపంలో ఉన్న కెమికల్ ఫ్యాక్టరీ సమీపంలో సోమవారం సాయంత్రం స్కూలు వ్యాను బోల్తాపడిన సంఘటనలో పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల మేరకు కడపలోని ఓ ప్రైవేటు స్కూలుకు చెందిన వ్యాను విద్యార్థులను ఎక్కించుకుని వల్లూరు, పెండ్లిమర్రి విద్యార్థులను ఇంటికి చేరవేసేందుకు వెళుతున్న సమయంలో మార్గమధ్యలో బోల్తా పడింది. బస్సులో దాదాపు 20 మంది విద్యార్థులు ఉన్నారు, వారిలో కొంత మంది గాయపడ్డారు. వీరిని స్థానికులు గుర్తించి వెంటనే 108 వాహనం ద్వారా కడపకు చికిత్స కోసం తరలించారు. విషయం తెలిసిన వెంటనే వల్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

మల్లయ్య కొండకు ప్రత్యేక సర్వీసులు

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 19: ప్రముఖ శైవక్షేత్రంతం బళ్లపల్లె మల్లయ్యకొండకు సోమవారం ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులను నడుపుతున్నట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. మదనపల్లె నుంచి ఉదయం 5 గంటలకు, 6.30 గంటలకు తంబళ్లపల్లె మల్లయ్యకొండకు బస్సుల నడుస్తాయన్నారు. తంబళ్లపల్లె నుంచి మల్లయ్య కొండకు సాయంత్రం వరకు షటిల్ సర్వీసులు అందుబాటులో ఉంటాయన్నారు.

పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

● కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవు

● కలెక్టర్ అభిషిక్త్ కిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: మార్చిలో జరగబోయే పదవ తరగతి పరీక్షలను అత్యంత పకడ్బందీగా నిర్వహించాలని, కాపీయింగ్ జరిగితే చర్యలు తప్పవని కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్‌హాల్‌లో విద్య, వైద్య, విద్యుత్, పోలీసు, ట్రెజరీ, తదితర శాఖల అధికారులతో మార్చి 18 నుంచి 30 వరకు జరగనున్న పదవ తరగతి పరీక్షలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు విద్యార్థి జీవితంలో చాలా కీలకమైన పాత్ర పోషిస్తాయన్నారు. అత్యంత పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో 129 కేంద్రాలలో 25522 మంది విద్యార్థులు పరీక్షలకు హజరుతున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకండా అన్ని రకాల వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

మార్కెట్ యార్డులో హమాలీల ఆందోళన

● తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలి

● మంత్రి అంజద్‌బాషాకు విన్నవించినా ఫలితం శూన్యం



మార్కెట్‌యార్డులో ఆందోళన చేస్తున్న హమాలీలు

కడప (రూరల్) ఫిబ్రవరి 19 : కడప మార్కెట్ యార్డులోని సెక్రటరీ కార్యాలయం ఎదుట హమాలీలు సోమవారం ఆందోళనకు దిగారు. తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని గంటపాటు నినదించారు. చైర్మన్, అధికారుల తీరును ఎండగట్టారు. ఈసందర్భంగా పలువురు హమాలీలు మాట్లాడుతూ మార్కెట్‌యార్డులో దాదాపు 100 మందికి పైగా హమాలీ పనిచేస్తున్నామని తెలిపారు. తాగడానికి గుక్కెడు మంచినీరు లేక దాహంతో అల్లాడుతున్నా పట్టించుకునే వారు లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 12వ తేదీ మార్కెట్‌యార్డుకు డిప్యూటీ సీఎం అంజద్‌బాషా వచ్చారని, ఆయనకు మాగోడును వెళ్లబోసుకున్నా ఫలితం లేదన్నారు. మార్కెట్ యార్డులో పసుపు, వేరుశనగ ఉత్పత్తుల లోడింగ్, అన్‌లోడింగ్ చేస్తున్నప్పుడు వాటిలోని దుమ్ము ధూళితో ఇబ్బందులు పడుతున్నామని, కనీసం తాగడానికి మంచినీరు లేక గొంతు ఎండిపోతోందన్నారు. తమ ఇక్కట్లను పలుమార్లు మంత్రికి, మార్కెట్ యార్డు చైర్మన్, సెక్రటరీలకు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఉన్నతాధికారులైనా స్పందించి తక్షణం తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించాలని, లేకుంటే నిరధికంగా అందోళనలను చేపడతామని హమాలీలు హెచ్చరించారు.

విద్యుధాఘాతంతో రైతు మృతి



జనార్ధన్‌రెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య ప్రమీల

సింహాద్రిపురం, ఫిబ్రవరి 19: మండలంలోని అంకాళమ్మగూడూరు గ్రామానికి చెందిన ఎర్రగుడి జనార్ధన్‌రెడ్డి (59) అనే రైతు సోమవారం విద్యుధాఘాతంతో మృతి చెందాడు. ఎస్ఐ అనీల్‌కుమార్ సమాచారం మేరకు జనార్ధన్‌రెడ్డి తన చీనీ తోట వద్ద గల విద్యుత్ మోటర్‌కు సంబంధించిన స్టాటర్ వద్ద విద్యుత్ వైర్లు సరి చేసుకుంటుండగా షాక్‌కు గురయ్యాడు. చుట్టు పక్కల వారు చూసి జనార్ధన్‌రెడ్డి కుటుంబీకులకు తెలిపారు. అంతలోపే అక్కడికి వెళ్లేలోపు జనార్ధన్‌రెడ్డి అపస్మారక స్థితిలో పడివున్నాడు. దీంతో పులివెందుల ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. జనార్ధన్‌రెడ్డికి భార్య, కుమారుడు, కూతురు కలరు. మృతుని భార్య ప్రమీల పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనీల్‌కుమార్ తెలిపారు.

ఆటో బోల్తా విద్యార్థులకు గాయాలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 19: మండలంలోని ఉప్పరపల్లె వద్ద సోమవారం ఆటో బోల్తా పడటంతో ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయా లయ్యాయి. చాపాడు మండలం ఖాదర్‌పల్లెకు చెందని అమీన, అబ్దుల్లా అనే విద్యార్థులు గాయపడ్డారు. వీరిని హుటాహుటిన గాంధీరోడ్డులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అందులో మూడవ తరగతి చదువుతున్న అమీనాకు తీవ్ర రక్తగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. ఆటో నడుపుతున్న డ్రైవరు పెద్ద గంగయ్యకు గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో మొత్తం ఐదుగురు విద్యార్థులు వుండగా.. మరో ముగ్గురు విద్యార్థులు సురక్షితంగా బయటపడ్డారు. ఖాదరుపల్లెకు చెందిన ఈ విద్యార్థులు ప్రతి రోజు ఉదయం ఆటోలో ఓ ప్రైవేటు పాఠశాలకు వెళ్లి తిరిగి సాయంత్రం అదే వాహనంలోనే ఇంటికి చేరుకుంటారు. ఈక్రమంలో పాఠశాల నుంచి సాయంత్రం ఇంటికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న బైక్ ఆటోను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు రూరల్ పోలీసులు వెల్లడిస్తున్నారు.

పరీక్ష కేంద్రం తనిఖీ



తనిఖీ చేస్తున్న వైస్ చాన్సలర్ సుధాకర్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 19: వైవీయూలో జరుగుతన్న పీజీ మొదటి సంవత్సరం పరీక్ష కేంద్రాలను వైస్ చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ సోమవారం తనిఖీ చేశారు. వీసీతో పాటు రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పరీక్షల నిర్వహణపై పర్యవేక్షణ అధికారులతో మాట్లాడారు. కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

రోకలిబండతో అత్తపై అల్లుడు దాడి

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 19: రోకలిబండతో అత్తపై అల్లుడు దాడి చేసిన సంఘటన మండలంలో సోమవారం చోటు చేసుకొంది. పోలీసుల కథనం మేరకు అన్నమయ్య జిల్లా చిన్నమండ్యం మండలం బోనుమలకు చెందిన రెడ్డెమ్మ తన కుమార్తెను నిమ్మ నపల్లి మండలం వెంగంవారిపల్లి పంచాయతి కొండ సానివా పల్లికు చెందిన రమణకు ఇచ్చి వివాహం చేసింది. అయితే అల్లుడు రమణ తన కుమార్తెను కొట్టడంతో అల్లుడిని ఎందుకు కొట్టావని నిలదీసింది. దీంతో అల్లుడు రమణ, తన తమ్ముడు శ్రీనాథ్‌లు ఇంట్లో వున్న రోకలిబండతో దాడి చేయడంతో రెడ్డెమ్మ తలకు తీవ్ర గాయమైంది. వెంటనే కుటుంబీకులు మదనపల్లి ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హంద్రీ-నీవా కాలువ ఆక్రమణలను అడ్డుకోవాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి19: మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో హంద్రీ-నీవా కాలువను, కాలువ గట్టులను కాపాడాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు యమల సుదర్శనం డిమాండ్ చేశారు.

సోమవారం హంద్రీ-నీవా ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హంద్రీ-నీవా కాలువ గట్టులను రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్ర మించి కాలువ గట్టుపై తారు రోడ్డు వేస్తున్నారని ఆరోపించారు. అక్రమణ దారు లపై చర్యలుతీసుకోవాలని లేనిపక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. నాయకులు మనోహర్, చంద్రయ్య, మోహన్, తదితరులుపాల్గొన్నారు.

వివేకా హత్య కేసులో అప్రూవర్ దస్తగిరికి బెయిలు మంజూరు

కడప(రూరల్) ఫిబ్రవరి 19: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరికి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి సోమవారం నాల్గవ అదనపు జిల్లా కోర్టు బెయిల్ మంజూరు చేసింది. వేముల మండల పోలీసు స్టేషన్‌లో పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, దాడి కేసును నమోదు చేశారు. ఈ మేరకు దస్తగిరిని అరెస్టు చేసి కోర్టుకు హాజరు పెట్టడంతో మూడు నెలులుగా కడప సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. సదరు కేసుకు సంబంధించి సోమవారం దస్తగిరికి నాల్గవ అదనపు జిల్లా కోర్టు (ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కోర్టు) బెయిల్ మంజూరు చేసింది. దస్తగిరి నేడు కడప సెంట్రల్ జైలు నుంచి విడుదల అయ్యే అవకాశం ఉంది. ఇదివరకే ఎర్రగుంట్ల పోలీసులు నమోదు చేసిన మరో అట్రాసిటీ కేసులో రెండు వారాల క్రితమే హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది.

దాల్మియాలో యువకుడు ఆత్మహత్య

మైలవరం, ఫిబ్రవరి 19: దాల్మియా పరిశ్రమలోని రేకులషెడ్డులో బ్యారక్ సైడ్ భాగంలో బీహార్‌కు చెందిన మంగళ్‌కుమార్ (22) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తలమంచిపట్నం ఎస్ఐ హను మంతు తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... బీహార్ రాష్ట్రంలోని కుర్బేలా జిల్లా, తింగర గ్రామానికి చెందిన కుమార్ దాల్మియా పరిశ్రమలో రెండు నెలలుగా పనులు చేస్తుండేవాడు. ప్రేమించిన అమ్మాయి దూరం కావడంతో బాధపడుతూ ఉండేవాడని.. ఈ క్రమంలో మనస్థాపం చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుమార్ తండ్రి సుబోద సహాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు వ్యవసాయ మోటార్లు చోరీ

చెన్నూరు, ఫిబ్రవరి 19 : కేసీ ప్రధాన కాల్వ వద్ద రైతులు నీటి కోసం ఏర్పాటు చేసుకున్న రెండు వ్యవసాయ మోటర్లను ఆదివారం రాత్రి దొంగలు ఎత్తుకెళ్లారు. ఇటీవల రబీలో ఆరుతడి పంటల కోసం కేసీ ప్రధాన కాల్వ వద్ద మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన రైతులు త్రిలోకనాథరెడ్డి, ముకుందస్వామిలు మోటార్లను ఏర్పాటు చేసుకోగా ఆదివారం రాత్రి మోటర్లకు ఉన్న పైపులు వైరుతో సహా కోసుకుని చోరీ చేశారు. ఇటీవల కాలంలో మోటార్ల వైర్ల దొంగతనాలు ఎక్కువగా జరిగాయి, ఇప్పుడు ఏకంగా మోటర్లనే దొంగతనం చేయడంతో ఆందోళన పడుతున్నారు. పోలీసులు నిఘా పెట్టి చోరీలను అరికట్టాలని కోరుతున్నారు.

జర్నలిస్టులపై దాడులు అరికట్టాలి

- ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ రౌడీ మూక దాడి హేయమైన చర్య
- దాడిచేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- లేదంటే ఆందోళన ఉధృతం
- వైసీపీ పాలనలో పత్రికా ప్రతినిధులకు రక్షణ కరువు
- ప్రజాస్వామ్యంలో ఉన్నామా.... ఆటవిక రాజ్యంలో ఉన్నామా
- కలెక్టరేట్ ఎదుట నిరసన ధర్నా కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


చెన్నూరులో తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న విలేకరులు, నాయకులు


కడపలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 19: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎలక్ట్రానిక్ మీడియా, పత్రికారంగ జర్నలిస్టులపై వైసీపీ రౌడీమూకలు దాడులకు తెగబడుతున్నాయని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం జిల్లా రాప్తాడులో వైసీపీ చేపట్టిన సిద్ధం సభలో అనంతపురం ఆంధ్రజ్యోతి పత్రిక ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ కార్యకర్తల ముసుగులో ఉన్న రౌడీమూక మూకుమ్మడిగా దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. ఇందుకు నిరసనగా సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. కార్యక్రమానికి పలువురు పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులతో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు వారధిలా సేవలందిస్తున్న ఫోటోగ్రాఫర్స్, పాత్రికేయులను టార్గెట్‌గా ఎంచుకుని దాడులకు తెగబడటం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదన్నారు. ప్రజాస్వామ్యాన్ని బతికించే ఫోర్ పిల్లర్స్‌లో ఒకటైన పత్రికారంగాన్ని వైసీపీ ప్రభుత్వం తొక్కిపాతరేయాలనుకోవడం ఎవరితరం కాదన్నారు. దాడిచేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు కిశోర్, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతో దాడి: బెస్త సాధికార కమిటీ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 19: జగన్ దుర్మార్గాలను ఆంధ్రజ్యోతి బయటపెడుతుందనే భయంతోనే మీడియాపై దాడికి పాల్పడుతున్నారని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనరు యాటగిరి రాంప్రసాద్ అన్నారు. ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం ద్వారకానగర్‌లోని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా బెస్త కులానికి చెందిన క్రిష్ణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి జైలుకు పంపించకపోతే ప్రత్యక్ష ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బెస్తసాధికార కమిటీ ప్రతినిధులు వై.సుబ్బరాయుడు, ఆవుల వెంకటేశ్, పోలి సాయి, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

విలేకరిపై దాడి హేయమైన చర్య: డీవైఎఫ్ఐ

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 19 : ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి హేయమైన చర్య అని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో నాలుగోస్తంభమైన మీడియాకు రక్షణ లేకుండాపోతోందన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

దాడి అరాచకానికి నిదర్శనం: పీడీఎస్‌యూ


మాట్లాడుతున్న శివకుమార్

అనంతపురం జిల్లా రాప్తాడులో ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అరాచకానికి నిదర్శనమని విద్యార్థి యువజన సంఘ నాయకులు ఖండించారు. సోమవారం పీడీఎస్‌యూ కార్యాలయంలో వారు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయవర్ధన్, ఆర్‌వైఎఫ్ జిల్లా కన్వీనరు భాస్కర్ విలేకరులతో మాట్లాడుతూ దాడి చేసిన వైసీపీ కార్యకర్తలపైన హత్యాయత్నం కింద కేసులు నమోదు చేయాలన్నారు.

దాడి నీచమైన చర్య: అఖిలపక్షం

చెన్నూరు, ఫిబ్రవరి 19 : వైసీపీ మూకల దాడి నీచమైన చర్య అని అఖిలపక్షం నేతలు మండిపడ్డారు. వైసీపీ మూకలు పత్రికా స్వేచ్ఛను హరిస్తున్నాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి దినపత్రిక ఫోటోగ్రాఫర్ శ్రీక్రిష్ణపై జరిగిన దాడి దుర్మార్గ చర్య అన్నారు. సోమవారం మండలంలోని టీడీపీ, బీజేపీ, కాంగ్రెస్ నేతలు చెన్నూరు బస్టాండులో నిరసన తెలిపారు. అనంతరం వైసీపీ పాలన నశించాలి, ఆ పార్టీ అరాచకాలను ఖండించాలి, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు ఇస్తూ చెన్నూరు బస్టాండు నుంచి తహసీల్దారు కార్యాలయం, పోలీసుస్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి తహసీల్దారు ప్రకాశ్‌బాబు, ఏఎస్ఐ జాకీర్‌హుసేన్‌కు వినతిపత్రం అందించారు. దాడి చేసిన మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్, బీసీ సెల్ నాయకులు ఆటోబాబు, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా మైనార్టీ నేతలు షబ్బీర్‌హుసేన్ సుదర్శన్ ఎస్సీ సెల్ నేతలు కొండాల చిన్నయ్య, రాంప్రసాద్, బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రమణ్యం, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, రైతు సంఘం అధ్యక్షుడు బాలక్రిష్ణారెడ్డి, టీడీపీ జిల్లా బలిజ సంఘం నేతల ఆకుల ప్రసాద్‌బాబు, విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు భవానీ ఆచారి, బీజేపీ మండల అధ్యక్షుడు భాస్కర్, స్టేట్ కౌన్సిల్ మెంబరు రవికుమార్, మాజీ అధ్యక్షుడు రెడ్డిప్రసాద్, కమలాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పొట్టిపాటి చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నూరు దినపత్రిక విలేకరులు శివప్రసాద్, ఎల్వీ సుబ్బారెడ్డి, చీర్ల చెన్నయ్య, ఆర్‌సీ కొండారెడ్డి, సురేష్, రంగయ్య పాల్గొన్నారు.

శ్రీకృష్ణపై దాడి అమానుషం

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 19:రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడి అమానుషమని సీపీఐ కడప నగర కార్యదర్శి ఎస్.వెంకటశివ సోమవారం ఓ ప్రకటనలో ఖండించారు. దాడికి నైతిక బాధ్యత సీఎం జగన్ వహిస్తూ జర్నలిస్టు సమాజానికి, ఫోటోగ్రాఫర్ క్రిష్ణకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దాడి పిరికిపంద చర్య

కడప (చిన్నచౌకు), ఫిబ్రవరి 19 : రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడి చేసి పిరికిపంద చర్య అని కడప నియోజకవర్గ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి లయన్ పఠాన్ ఖాదర్‌బాషా అన్నారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి రఫీక్‌ఖాన్, సుబ్బరాయుడు, ఖదీర్, ఆటో యూనియన్ నాయకులు మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 19 : ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై జరిగిన దాడి అమానుషమని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదనవిజయకుమార్, పాలెం మహేష్‌బాబు తీవ్రంగా ఖండించారు. అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజాస్వామ్యానికి ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందన్నారు.

దాడి చేయడం హేయమైన చర్య

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 19 :ఆంధ్రజ్యోతి రిపోర్టర్ శ్రీక్రిష్ణపై దాడి హేయమైన చర్య అని ఏపీయుడబ్ల్యూజే నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు కమలాపురంలో తహసీల్దారు, ఎస్ఐకు వినతిపత్రం అందించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో జర్నలిస్టులు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ఉన్నారన్నారు. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవఆలని డిమాండ్ చేశారు.

దాడి అమానుషం: సాయినాథ్‌శర్మ

ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ గుండాలు దాడి చేసి గాయపరచడం అమానుషమని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి కాశీభట్ల సత్యసాయినాథ్‌శర్మ అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలి

పులివెందుల, ఫిబ్రవరి 19: ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని పులివెందుల ఏపీడబ్ల్యూజే నాయకులు పేర్కొన్నారు. ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకల దాడికి నిరసనగా ఏపీడబ్ల్యూజే పిలుపు మేరకు పులివెందులలో సోమవారం వైఎస్ విగ్రహానికి జర్నలిస్టులు వినతిపత్రం అందించారు.ఏపీడబ్ల్యూజే నా యకులు, విలేకరులు మహేశ్వరరెడ్డి, అమర్, రామకృష్ణ, చంద్రమోహన్, రమేష్, రాజు, కార్తిక్, ప్రవీణ్, వివేకానందయాదవ్, శేషారెడ్డి, రమణారెడ్డి, జయరామకృష్ణ, మురళి, కృష్ణ, శంకర్‌రెడ్డి, పఠాన్ తదితరులు పాల్గొన్నారు.

దాడి అమానుషం

వేంపల్లె, ఫిబ్రవరి 19: అనంతపురం జిల్లా రాప్తాడు సిద్ధం బహిరంగ సభలో వైసీపీ కార్యకర్తలు ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అమానుషమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. నిందితులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందన్నారు. జగన్ పాలన అరాచక పాలన అనేందుకు ఇదే నిదర్శనమన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, ఓటుతోనే వారు బుద్ధిచెబుతారని పేర్కొన్నారు.

పాత్రికేయులపై దాడి హేయమైన చర్య

పాత్రికేయులపై దాడి చేయడం హేయమైన చర్య అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన వేంపల్లెలో మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలనిప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

దాడి అప్రజాస్వామికం

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండ్లకుంట శ్రీరాములు సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఫోటోగ్రాఫర్‌పై దాడి నీచం

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 19: ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ కృష్ణపై దాడి చేయడం అమానుషమని మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి పేర్కొన్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించడం బాధాకరమన్నారు. టీడీపీ నేతలు రఘునాథరెడ్డి, చంద్రారెడ్డి, చెండ్రాయుడు, తెలుగుయువత రాష్ట్ర కార్యదర్శి చంద్రబాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 19: ఫొటోగ్రాఫర్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని పులివెందుల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.

ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధం

వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ రెక్కలు విరిచేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ నేతలు లింగాల మండల కన్వీనర్ విశ్వనాథరెడ్డి, తెలుగుయువత ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు.





కడప: మాట్లాడుతున్న రాంప్రసాద్...మాట్లాడుతున్న లయన్ పఠాన్ ఖాదర్‌బాషా...కమలాపురం: డిప్యూటీ తహసీల్దారు అహల్యకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు.. మాట్లాడుతున్న విద్యార్థి యువజన సంఘ నాయకులు

ఘనంగా సురేష్ - ఐ హాస్పిటల్ ప్రారంభోత్సవం


ఆస్పత్రి ప్రారంభోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, పీవీఎస్ మూర్తి సురేష్‌బాబు దంపతులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 19: కడప నగరం హౌసింగ్‌బోర్డు కాలనీ రాజీవ్ పార్కు రోడ్డులో సురేష్ ఐ హాస్పిటల్‌ను ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యులు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌చిర్జ్ మాధవీరెడ్డి, పీవీఎస్ మూర్తి దంపతులు పాల్గొని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కడప నగరంలో ఐ హాస్పిటల్ అందరికీ అందుబాటులో ఉన్నందుకు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్‌బాబు, ఎ.లక్ష్మి, డాక్టర్ సాయి సబిత, పావని, డాక్టర్ క్రిష్ణకిశోర్‌రెడ్డి, హరిప్రసాద్, ఆది రాంబాబు, ఆది మదన్, గాజుల హరిప్రసాద్, టింబర్ డిపో శ్రీనివాసులు, తోట క్రిష్ణ, జనసేన పార్టీ నాయకుడు తుంగా రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు ఇళ్ల స్థలాల దరఖాస్తులకు గడువు పెంపు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ దరఖాస్తులకు మరో వారం రోజులు గడువు పెంచినట్లు రాష్ట్ర సమాచార కమిషనరు విజయకుమార్ రెడ్డి నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పురుషోత్తం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకు అర్హులైన జర్నలిస్టుల నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అనుకున్న సమయానికి పనులు పూర్తి చేయాలి

- కమిషనరు ప్రవీణ్‌చంద్


అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 19 : అనుకున్న సమయానికి నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులకు కమిషనర్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. అనధికార నిర్మాణాలు గుర్తించి నోటీసులు ఇవ్వాలని సూచించారు. సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూనాణ్యత లోపాలు లేకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా చేయాలని తెలిపారు. జేకేవైసీ, ఈకేవైసీ పెంచాలని, ప్రజల సమస్యలు త్వరగా పరిష్కరించాలని తెలిపారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

సీకేదిన్నె, ఫిబ్రవరి 19: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని చింతకొమ్మదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రమైన చింతకొమ్మదిన్నెలో రిమ్స్ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక క్యాంప్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి అటు విద్యాసంస్థకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని విద్య ద్వారానే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ హేమగిరి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మాబుచాన్, ఎంపీడీవో విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీని సాగనంపేందుకు సిద్ధం: టీడీపీ


మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 19 :రాష్ట్రంలో వైసీపీని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ పేర్కొ న్నారు. చెన్నూరు టీడీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రోజురోజుకూ అరాచకాలు పెరిగే ఈ పాలనకు అంతిమయాత్ర తప్పదన్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, రైతు నేత బాలక్రిష్ణారెడ్డి, బీసీ నేత గోదిన శ్రీనివాసులు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి సుధాకర్‌రెడ్డి,మైనార్టీసెల్ జిల్లా కార్యదర్శి మంజూరు అహ్మద్,ఎస్సీ సెల్ జిల్లా నేతలు కొండాల చెన్నయ్య, సుదర్శన్,రాంప్రసాద్, మాజీ జడ్పీటీసీ చిన్నయ్య, బీసీ నేతలు గోదిన శ్రీనివాసులు, ముద్దల బాబు పాల్గొన్నారు.

19 సీఎన్ఆర్ 4 మాట్లాడుతున్న టీడీపీ నేతలు

వైసీపీని ఇంటికి పంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారు

కమలాపురం రూరల్, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో రెండు నెలల్లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయని ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు జనం సిద్ధంగా ఉన్నారని తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఏ ఒక్క ప్రాజెక్టు పనులు పూర్తి చేయలేదన్నారు. అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతే నిర్వాసితులకు సహాయం లేదు, ప్రాజెక్టు నిర్మాణ పనులు లేవన్నారు.ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా, మాజీ తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు దివాకర్‌రెడ్డి, మాజీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జంపాల నరసింహారెడ్డి, మండల కన్వీనరు రాఘవరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రెడ్డికరీం, బాలిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ కోతలను నివారించాలి

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 19 : జిల్లాలో విద్యుత్ కోతల వల్ల అనేక ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరి అన్నారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వారు నిరసన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ సూపరింటెండెంట్ ఇంజనీరుకు వారు వినతిపత్రం అందించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలక్రిష్ణయ్య, నాయకులు చిన్నసిద్దయ్య, రమణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

గొప్ప పోరాట యోధుడు ఛత్రపతి శివాజీ

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీమహరాజ్ గొప్ప పోరాట యోధుడు అని రామగిరి బాబా సేవా సమితి అధ్యక్షుడు షిండే రాజభాస్కర్‌రావు అన్నారు. శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని సోమవారం రవీంద్రనగర్‌లోని శ్రీరామగిరి బాబా సేవా సమితి కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

'తెలుగుభాషకు తిలోదకాలు'

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 19 : తెలుగుభాషకు తిలోదకాలు ఇస్తున్నారని ఏపీ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యుడు డాక్టర్ తవ్వా వెంకటయ్య పేర్కొన్నారు. సోమవారం కడప నగరం ప్రభుత్వ పురుషుల కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాలలో ప్రతి శాఖ పేరు ఆంగ్లంలో ఉండటం సరికాదన్నారు. తెలుగుశాఖలో పనిచేస్తున్న అధ్యాపకుల పేర్లు కూడా ఆంగ్లంలోనే రాయడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

లబ్ధిదారుడి పట్టాను వేరొకరికి ఎలా ఇస్తారు?

వేంపల్లె, ఫిబ్రవరి 19: ఒక లబ్ధిదారునికి ఇచ్చిన పట్టాను వేరొకరికి ఎలా ఇస్తారని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో కన్వీనర్ దాదాపీర్ అధికారులను ప్రశ్నించారు. వేంపల్లె తహసీల్దార్ కార్యాలయంలో బాధితులతో కలిసి సోమవారం అధికారులతో మాట్లాడారు. ఎస్కే జమీల జగనన్న కాలనీలో పట్టా ఇచ్చారు నోటీసు ఇవ్వకుడా రద్దుచేయడం అన్యాయమన్నారు. న్యాయం చేయాలని కోరారు.


టీడీపీ కడప పార్లమెంటు అధ్యక్షుడిగా నియమితులైన ఆర్.శ్రీనివాసరెడ్డిని సన్మానించిన జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్‌హరిక్రిష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, శివకొండారెడ్డి

టీడీపీ తప్పక అధికారంలోకి వస్తుంది : బీటెక్ రవి


వేంపల్లెలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో మహిళతో మాట్లాడుతున్న బీటెక్ రవి

వేంపల్లె, ఫిబ్రవరి 19: వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించి అధికారంలోకి రావడం వందశాతం తథ్యమని మాజీ ఎమ్మెల్సీ పులివెందుల ఇన్‌చార్జి బీటెక్‌రవి ధీమా వ్యక్తం చేశారు. వేంపల్లెలో బాబు ష్యూరిటీ కార్యక్రమానికి సోమవారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. పార్టీ కార్యాలయం నుంచి కార్యకర్తలతో పులివెందుల రోడ్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. నాలుగు రోడ్ల కూడలిలో మండల పరిశీలకుడు రఘునాథరెడ్డి, మండల కన్వీనర్ మునిరెడ్డి, ఎస్సీ నాయకులు వెంకటయ్య, ఈశ్వరయ్య తదితరులతో కలిసి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసినివాళులు అర్పించారు. అనంతరం దుకాణాలు, తోపుడుబండ్ల వద్ద కార్యక్రమం నిర్వహించారు. అలాగే టీడీపీకి దూరంగా ఉంటున్న పలలువురు నాయకుల ఇళ్లవద్దకెళ్లి కలిసి రావాలని బీటెక్ రవి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ రాప్తాడు సభలో ముఖ్యమంత్రి జగన్ పచ్చిఅపద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. గుంతల రోడ్లను జగన్‌కు మంచిరోడ్డుగా కనిపిస్తోంది, జగన్ అన్యాయం చేశారన్నారు. వైసీపీపై వేంపల్లె ప్రజల్లో స్థానిక నేతలపై అసంతృప్తి ఉందన్న విషయం స్వయంగా తెలుస్తోందని ఆయన తెలిపారు. వేంపల్లెలో టీడీపీ మెజారిటీ సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మైనార్టీ సెల్ డైరెక్టర్ షబ్బీర్, నిమ్మకాయల దర్బార్ బాష, బీవీ సుబ్బారెడ్డి, దొంతుసుబ్బారావు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

- శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి


బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో వాసు, మాధవీరెడ్డి, సుంకర శ్రీనివాస్ తదితరులు

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో జరుగుతున్న అరాచక ప్రభుత్వానికి త్వరలో ప్రజలే బుద్ధి చెబుతారని టీడీపీ పొలిట్‌బ్యూరోసభ్యులు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆర్.మాధవీరెడ్డి, సుంకర శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కడప నగరం 31వ డివిజను రెండోగాంధి బొమ్మ రజాఖాన్‌బాగ్ మసీదు నుంచి బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ కరపత్రాలను అందించారు. అలాగే టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలోవైసీపీ ప్రభుత్వం అరాచకాలు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లరి మూకల దాడి నిదర్శనమాన్నరు. ప్రజలందరూ ప్రభుత్వ పనితీరును చూస్తున్నారని త్వరలో బుద్ధి చెబుతారన్నారు. కార్యాలయం ప్రారంభోత్సవం 31వ డివిజనులో టీడీపీ కార్యాలయాన్ని శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డి, జనసేన ఉమ్మడి కడప జిల్లా కోఆర్డినేటరు సుంకర శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయబ్, శివకొండారెడ్డి, ఇస్మాయిల్, జిలానీబాషా, గౌస్, జియావుద్దీన్, జమీల్, భాస్కర్, ఖాజాపీర్ పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ మెగా లోక్ అదాలత్

కడప(రూరల్) ఫిబ్రవరి 19 : జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మార్చి 9న ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు డిఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎలాంటి కర్చు లేకుండా రాజీ మార్గంలో వారి వారి కేసులను పరిష్కరించుకోవాలన్నారు.


జమ్మలమడుగులో డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న విలేకరులు


బద్వేలులో.. తహసీల్దారుకు


ముద్దనూరులో..


అట్లూరులో..

జర్నలిస్టులపై ప్రభుత్వ వైఖరి ప్రమాదకరం

- వాడవాడలా వెల్లువెత్తిన నిరసనలు
- రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల మద్దతు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో జర్నలిస్టుపై దాడులు పెరిగి పోయాయని, ప్రభుత్వంలో ఉండే పెద్దలే జర్నలిస్టులపై దాడులకు ఉ సిగొలపడాన్ని ప్రభుత్వాలు ఉపేక్షించరాదని ప్రొద్దుటూరు జర్న లిస్టుల సంఘం నేతలు సోమా రవి, ఉట్టి నరేంద్ర, వనం శర్మ, మ నోజ్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రొద్దు టూరు జర్నలిస్టుల సం ఘం ఆధ్వర్యంలో రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ కార్యకర్తల దుర్మార్గపు దాడికి నిరసనగా ర్యాలీ, ధర్నా నిర్వహించారు. బీజేపీ, కాంగ్రెస్ , టీడీపీ ,జనసేన, సీపీఐ, సీపీఎం, విరసం, సృజనా సామాజికవేదిక , ఏఐఎస్ఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ మాల మహానాడు, ఎంఆర్‌పీఎస్, బీసీ సమాఖ్య తదితర ప్రజా సంఘాలు మద్దతుగా ఆందోళనలో పాల్గొన్నారు. ఫొటో జర్నలిస్టు కృష్ణపై దాడి చేసిన వైసీపీ కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని లేదంటే ఉద్య మం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దారు విద్యాసాగర్‌కు వినతి ఎత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సీఎం సురేష్ నాయుడు, వీఎస్ ముక్తియార్, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వరద రాజులరెడ్డి, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు , సీపీఐ జిల్లా నాయకుడు బత్తల రామయ్య, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బ రాయుడు, నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ గొర్రెశ్రీనివాసులు, జిల్లా ఉపాధ్య క్షుడు ప్రొద్దుటూరు సుబ్రమణ్యం, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ పిఎండీ నజీర్, పట్టణ అధ్యక్షుడు లాయర్ జిలాన్, జనసేన పార్టీ ప్రతినిధు లు జిలాన్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు మురళి, విప్లవ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు వరలక్ష్మి, సృజన సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డితో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా యూట్యూబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

బద్వేలు: బద్వేలు తహసీల్దారు కార్యాలయం ఎదుట ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో ధర్నా చేశారు. నియోజకవర్గ ఏపీడబ్ల్యూజే అధ్యక్షుడు వెంకటేష్, సుదర్శన్‌రెడ్డి, జానీ మాట్లాడుతూ దాడిచేసిన వారిపై హ త్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు మధుసూదన్‌రావుకు వినతిపత్రం అందించారు. దాడి అమానుషమని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మాదన విజయ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు.

బద్వేలు రూరల్ : ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ గూండాల దాడిని తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు జహంగీర్‌బాషా, మాచుపల్లె కృష్ణారెడ్డి, కంభం శివానందరెడ్డి, సంజీవరాయుడు పాల్గొన్నారు.

కాశినాయన: దాడి హేయమని బద్వేల్ టీడీపీ యువనేత కే.రితీష్‌రెడ్డి, కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, మండల టీడీపీ బాధ్యుడు రాజారెడ్డి తదితరులు నర్సాపురం తహసీల్దారు కార్యాల యం వద్ద నిరసన వ్యక్తంచేశారు. విలేకరులు, కార్మికసంఘాల నాయ కులు, టీడీపీ నాయకులతో తహసీల్దారు కృష్ణకు వినతిపత్రం అందజేశారు.

అట్లూరు అట్లూరు తహసీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందించారు. విలేకరులు ప్రద్యుమ్నరెడ్డి, లక్ష్మీనారాయణ, మునెయ్య, తిరుపాల్, కొండారెడ్డి, వెంకటరామిరెడ్డి, మండల టీడీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జమ్మలమడుగు: ఏపీడబ్ల్యూజే పిలుపు మేరకు పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద జమ్మలమడుగు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఆర్డీవో లేకపోవడంతో ఏవో వెంకటలక్షుమ్మకు వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి స పాత బస్టాండు గాంధీ విగ్రహం మీదుగా ప్రొద్దుటూరు రోడ్డులోని డీఎస్పీ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించి డీఎస్పీ యశ్వంత్‌కు వినతి పత్రం అందజేశారు. టి.హాజి, ప్రవీణ్, చంద్రశేఖర్‌రెడ్డి, చలపతి, శివప్రసాద్‌రెడ్డి, వైకే కిరణ్, ఆవుల రమేష్, రవి, కిరణ్, హారీఫ్, మధు, శేషారెడ్డి, చిన్నికృష్ణ, హరి, షేక్షావలి, రమేష్, సుబ్బు, శివ, రాధాకృష్ణ, గంగాధర్, విజయ్, సీపీఎం కార్యదర్శి యేసుదాసు, పట్టణ కార్యదర్శి దాసరి విజయ్, వినయ్‌కుమార్, సీపీఐ కార్యదర్శి ప్రసాద్, డీవైఎఫ్ఐ నాయకులు తులసీశ్వర్‌యాదవ్, ఉదయ్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందన్నారు. కడపజిల్లా ఫోగ్రాం కమిటీ నేత పవన్‌కుమార్ రావు, తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాలాజి చిన్నవెంకటస్వామి, జమ్మలమడుగు కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ మంచాల పుష్పరాజు తదితరులు దాడిని ఖండించారు.


ప్రొద్దుటూరు: తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న జర్నలిస్టులు, వివిధ పార్టీల ప్రతినిధులు

పోరుమామిళ్ల : మండల పాత్రికేయులు భాస్కర్‌రావు, బాలయ్య, రమణ, అమర్, నాయబ్‌రసూల్, బాల స్వామి, దాదాపీర్, రమణారెడ్డి, భాస్కర్ తదితరులు రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

ముద్దనూరు : పాత్రికేయులపై దౌర్జన్యం వంటి చర్యలు భవిష్యత్‌లో జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విలేకరులు చలపతిరావు, బాలకృష్ణయాదవ్, ఏసు, నందకుమార్, సుధాకర్ తహసీల్థారు సువర్ణదేవికి వినతిపత్రం సమర్పించారు.

కొండాపురం: మండల సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు కొండాపురం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతిపత్రాన్ని అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి మనోహర్‌బాబు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఖాజీపేట: ఖాజీపేట విలేకరులు ఎం.నాగేశ్వరరెడ్డి, పీవీ జయచంద్రారెడ్డి, జె.కోటిరెడ్డి, డి.శివరామిరెడ్డి, ధనరాజ్, చంద్ర ఓబుళరెడ్డి, తదితరులు తహసీల్దారు వెంకటలక్ష్మికి వినతిపత్రం అందజేశారు

మైదుకూరు: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్, జనసేన ఇన్‌చార్జ్ మల్సోత్ర, సీపీఎం, సీపీఐ నాయకులు శివకుమార్, శ్రీరాములు తమ అనుబంధ సంఘాల నాయకులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందచేశారు. దాడి చేసిన వారిని అరెస్టు చేయాలంటూ మైదుకూరు నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో తహసీల్దారు నరేంద్రరెడ్డికి వినతిపత్రం అందచేశారు.

గోపవరం: పత్రికా విలేకరులు రఘురామిరెడ్డి, అఖిల్, మౌలా ప్రసాద్ తదితరులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక అధికారులకు వినతిపత్రం అందించారు.


కాశినాయన: తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న కే.రితీష్‌రెడ్డి, విలేకరులు


పోరుమామిళ్ల: తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న పాత్రికేయులు


గోపవరం: నిరసన వ్యక్తం చేస్తున్న విలేకరులు


కొండాపురం తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు


ఖాజీపేటలో..



మైదుకూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు, నాయకులు

గెలిపించినా.. ఓడించినా.. ప్రజలే అంతిమ నిర్ణేతలు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 19: ఓట్లేసి గెలి పించినా.. ఓడించినా.. అంతిమ నిర్ణేతలు ప్రొద్దుటూరు ప్రజలని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెన్నకేశవ స్వామి ఆలయ భూములను స్వాహా చేయడానికే ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అందులో రోడ్లు వేశాడన్నారు. ఇప్పటికే మైలవరం ఉత్తర కాలువను ఆక్రమించి కట్టడాలు కట్టాడని, గోపవరంలో ప్రభుత్వ భూమి ఆక్రమించి చదును చేశాడన్నారు. ఆయన భూదందాలను ప్రశ్నిస్తే తాను విజయవాడలో బ్రాహ్మణుడిని కాల్చి చంపి, అతని ఆస్తి కాజేశామని ఆరోపించాడన్నారు. తన రాజకీయ జీవితంలో సెంటు భూమి ఆక్రమించినట్లు నిరూపించమన్నారు. డీఎడబ్ల్యూ కాలేజీ భూముల్లో ఎంత డబ్బులు గుంజాడో ఎవరిచేతుల మీద తీసుకున్నాడో త్వరలో వెల్లడిస్తానన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారులను అడ్డుగా పెట్టుకుని ఎక్కడెక్కడ ఎంత వసూలు చేశావో త్వరలో వెల్లడిస్తానన్నారు. నీ అవినీతి సంపాదనంతా ప్రజలనుంచి దోచినదే కోట్లు కుమ్మరించినా నీవు ప్రజలు ఓట్లు వేసే పరిస్థితి లేదన్నారు. త్వరలో ఎన్నికలు రాబోతున్నాయని నీ అవినీతి చిట్టా ప్రజల ముందు వుంచుతానన్నారు. సమావేశంలో మాజీ కౌన్సిలర్ వద్దిబాలుడు,ఎర్రన్న తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

టీడీపీని గెలిపిస్తే యువత సంక్షేమానికి కృషి: భూపేష్

ముద్దనూరు ఫిబ్రవరి 19: టీడీపీని గెలిపిస్తే యువతకు ఉద్యోగాలు ,ఉపాధి కల్పనకు కృషి చేస్తానని జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపే ష్‌రెడ్డి హామీ ఇచ్చారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం టీడీపీ శ్రేణుల సోషల్ మీడియా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ వైఖరిని సోషియల్ మీడియా వేదికగా ఎండగట్టాలన్నారు. మాతాత చనిపోయాడు, మానాన్న చనిపోయాడు, మా చిన్నాన్న చనిపోయాడు అని చెప్పి సానుభూతితో ఓట్లు సంపాదించుకోవాలని చూస్తున్న జగన్ మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరన్నారు. .బాబు వస్తే జాబు గ్యారెంటీ అని నిరుద్యోగ యువత ఆశగా చూస్తోందన్నారు.ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడి దుర్మార్గ చర్య అన్నారు.టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంభాపురం రమణారెడ్డి, కడప పార్లమెంట్ ఐటీడీపీ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు శివరామిరెడ్డి, జనసేన నాయకులు జగదీష్, కేశవరెడ్డి, జగదీశ్వరరెడ్డి, శేఖర్‌నాయుడు, రాజశేఖర్‌యాదవ్, బాబురెడ్డి, సన్నీ టీడీపీ ,జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: పుట్టా

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 19 : శాసనసభ్యునిగా ఒక్కసారి అవకాశమిచ్చి గెలిపిస్తే కొత్తపల్లె గ్రామంతో పాటు మండలాన్ని అభివృద్ధిపథం వైపు తీసుకెళతానని మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జ్ పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పి.కొత్తపల్లెలో పెద్దలు, స్నేహితులు, బంధువులు టీడీపీ నాయకులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పదవి లేకున్నా దాదాపు రూ.50 కోట్ల వరకు నిధులు వ్యయం చేశానన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, చిలమల నాగయ్య, వేల్పుల సుదర్శన్, రాజేశ్వర్‌రెడ్డి, బుజ్జి, బాలదుగ్గిరెడ్డి, శ్రీను, దాసు, సుబ్బరామశర్మ, నాగరాజుస్వామి, వీరయ్య, రాజారెడ్డి, వీరారెడ్డి, రామసుబ్బయ్య, చిన్న, చెన్నయ్య, రామకృష్ణ, బాలాజీరెడ్డి, ఎం.దుగ్గిరెడ్డి, పూజా శివయ్యయాదవ్, ఎర్రంపల్లి రవి, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న పుట్టా సుధాకర్ యాదవ్

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

కాశినాయన ఫిబ్రవరి 19: టీడీపీ అభ్యర్థి లక్ష్యంగా నాయకులు కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, యువనేత రితీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నర్సాపురంలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం, జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్య కర్తలు పరస్పర సహకారం, సమన్వయంతో పనిచేసి బద్వేల్ నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తెద్దామన్నారు. కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి మురళి, మండల టీడీపీ అధ్య క్షుడు ఎం.రాజారెడ్డి, తెలుగు యువత అధ్యక్షుడు పి.రవీంద్రారెడ్డి, సర్పంచ్ ఖాజావలి పాల్గొన్నారు.


టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న విజయమ్మ

ఆర్డీవో కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా

బద్వేలు, ఫిబ్రవరి 19: సోమశిల మునక ప్రాంతం అట్లూరు, గోపవరం మండలాల్లోని పేదలకు ఇంటి స్థలాలు, భూములు ఇవ్వాలంటూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి వెంకటేష్ మాట్లాడుతూ అట్లూరు మండలం, ఎస్.వెంకటాపురం, రంగంపల్లె, చలంగారి పల్లె ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అట్లూరు క్రాస్ రోడ్డులో ముంపు బాధితులకు ఇంటి స్థలాలు, భూములు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 1779 సర్వే నెంబరులో గత ప్రభుత్వంలో 80 మందికి డీకేటీ పట్టాలు ఇచ్చారని అయితే కలెక్టర్ అనుమతి లేకుండా, గతంలో వీఆర్వోలుగా పనిచేసిన వారి సంతకాలు ఫోర్జరీ చేసి మూడు సెంట్ల స్థలాన్ని 2 సెంట్లుగా మారుస్తూ దొంగ అనుబంధ ఫారాలు, సృష్టించారని ఆరోపించారు. జయరాజు, రాంబాబు, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్ల పేరుతో వేధింపులు తగదు

బద్వేలు రూరల్, ఫిబ్రవరి 19 : ప్రైవేటు ఉపాధ్యాయులను అడ్మిషన్ల పేరుతో వేధిస్తున్న విద్యా సంస్థల యాజమాన్యాలపై జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రైవేటు టీచర్స్ అండ్ లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంటా వెంకటయ్య డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుని ప్రైవేటు టీచర్లకు రక్షణ కల్పించాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

జమ్మలమడుగు, ఫిబ్రవరి 19: జమ్మలమడుగులో మార్చి 9వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్ ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జమ్మలమడుగు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.భార్గవి సూచించారు. సోమవారం జమ్మలమడుగు కోర్టు ఆవరణలో న్యాయవాదులకు పోలీసు అధికారులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో సమస్యలు కేసులు రాజీ పడితే ఇద్దరూ గెలువడమే కాక సుప్రీం కోర్టు తీర్పుతో సమానంగా డిక్రీ ఇస్తారన్నారు.

జర్నలిస్టు ఇళ్ల స్థలాల దరఖాస్తు గడువు పెంపు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 19: జర్నలిస్టుల ఇళ్ల స్థలాల ఆన్‌లైన్ దరఖాస్తులకు మరో వారం రోజులు గడువు పెంచినట్లు రాష్ట్ర సమాచార కమిషనరు విజయకుమార్ రెడ్డి నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పురుషోత్తం రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 26వ తేదీ వరకు అర్హులైన జర్నలిస్టుల నుంచి వెబ్‌సైట్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆధార్ కార్డులో మార్పులు చేర్పులకు అవకాశం

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 19 : బ్రహ్మంగారిమఠం మండలంలోని మల్లేపల్లె, ముదుమాల గ్రామ సచివాలయాల్లో ఫిబ్రవరి 20న చౌదరివారిపల్లె, గొడ్లవీడు ఫిబ్రవరి 21న, దిరవంచ, డిసేలటూరు 23 గ్రామ సచివాలయంలో ఆధార్‌కార్డుల్లో కొత్త, చేర్పులు మార్పులు చేస్తున్నారని గ్రామ ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో నాగమల్లేశ్వరప్ప ప్రకటనలో తెలిపారు.

ఓటు నమోదు చేసుకోవాలి

మైదుకూరు, ఫిబ్రవరి 19 : 18 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలని ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దారు బాబా ఫక్రుద్దీన్ కోరారు. స్థానిక వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, అమ్మసేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్గించారు. వాగ్దాదం శివశంకర్, ఖాజాహుస్సేన్, ఉపేంద్ర, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించాలి

మైదుకూరు, ఫిబ్రవరి 29 : సుందరయ్య కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి శివకుమార్ ఆధ్వర్యంలో స్థానికులు మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో రోడ్లు, మురికి కాలువలు ఏర్పాటు చేయాలని కోరారు. ఇళ్ళకు నెంబర్లు వేసి అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలను ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనరు కు వినతి పత్రం అందచేశారు.

ఛత్రపతి శివాజీ శోభాయాత్ర

ప్రొద్దుటూరు/ పోరుమామిళ్ల, ఫిబ్రవరి 19 : ఛత్రపతి శివాజీ మహరాజ్ జయంతి సందర్భంగా సోమవారం పోరుమామిళ్లలో ఛత్రపతి శివాజీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులోని అగ్నిమాపక కేంద్రం నుంచి మల్లకతవ వద్ద ఉన్న ఆంజనేయగుడి వరకు, శోభాయాత్ర నిర్వహించారు. మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నివాళులర్పించారు కార్యక్రమంలో మరాటా సోదరులు సోదరీమణులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజే కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పరీక్ష సామగ్రి అందజేత

కాశినాయన ఫిబ్రవరి 19: వరికుంట్ల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో పది, ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ తరఫున పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందజేసిన తాడిపత్రి పట్టణానికి చెందిన హెచ్‌పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ కే.ఓబులేసు మాట్లాడుతూ తల్లిదండ్రులతో ఎవరైతే ప్రేమగా ఉంటారో వారికి భగవంతుడి ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకుడు రామకృష్ణారెడ్డి, సంస్థ గౌరవసలహాదారుడు రాజోలి శ్రీధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మెర్సీ పాల్గొన్నారు.

మాడల్ స్కూల్ విద్యార్థులకు బహుమతులు

ఖాజీపేట, ఫిబ్రవరి 19: ఏపీఎస్‌ఆర్టీసీ నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో ఖాజీపేట మాడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ ప్రదర్శించి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు ఎం.భార్గవి క్విజ్‌లో మూడవ బహుమతి, గోవర్ధన్ వ్యాసరచనల్లో మొదటి బహుమతి, జ్ఞాపికలను కలెక్టర్ చేతుల మీదుగా అందుకోవడంతో ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయనరసింహ అభినందించారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా పాల్గొనాలన్నారు.

బస్సు డ్రైవర్‌కు మల్లెల లింగారెడ్డి నివాళి

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 19 : అవయవదానం చేసిన ప్రైవేట్ బస్సు డ్రైవర్ మల్లెల రామాంజనేయరెడ్డి మృతదేహాన్ని సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు గోపవరం గ్రామానికి తీసుకొచ్చారు. టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రయాణికులను కాపాడిన ఆయనను కొనియాడారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని లింగారెడ్డి, గ్రామస్తులు కోరుతున్నారు.

వైసీపీ దౌర్జన్యాలే టీడీపీ విజయసోపానాలు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 19: రాష్ట్రంలో వైసీపీ చేస్తున్న దౌర్జన్య కాండలే టీడీపీకి విజయ సోపానాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక సోములవారి పల్లె పంచాయతీ ఈశ్వర్‌రెడ్డి నగర్ సున్నంబట్టి వీధుల్లో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రవీణ్‌రెడ్డి సతీమణి మౌనికారెడ్డి, సోదరి హరితారెడ్డి, వార్డు ఇన్‌చార్జ్ బెజవాడ అమ్మణ్ణి, నందం లక్ష్మీదేవి, బండి భాస్కర్‌రెడ్డి , పాణ్యం సుబ్బరాయుడు, పొట్టి పాటి గంగాధర్, పెయింటర్ సుబ్బరాయుడు విశ్వనాథరెడ్డి పాల్గొన్నారు.

రాచమల్లు అరాచకాలు అంతమొందిస్తాం

ప్రొద్దుటూరు వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి అవినీతి అరాచక పాలనను అంతమొందిస్తామని టీడీపీ నాయకుడు సీఎం సురేష్ నాయుడు తెలిపారు. సోమవారం స్థానిక 11వ వార్డు సార్వకట్టవీధి గిడ్డంగి వీధుల్లో సీఎం సురేష్ నాయుడు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపాలిటీ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఈవీ సుధాకర్‌రెడ్డి , టీడీపీ యువత రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లబోతుల నాగరాజు, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

మైలవరం: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్ రెడ్డి సతీమణి జ్యోతి, తల్లి దేవగుడి సరస్వతి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని చిన్నవెంతుర్ల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచులు బూరుగుల దేవి, వెంకట శివరామిరెడ్డి, నాయకులు పాపిరెడ్డి, కొండయ్య, సూర్యపెద్దిరాజు, రాజారెడ్డి, బాస్కర్, మహమ్మద్ హుస్సేన్, చంద్రశేఖర్‌రెడ్డి, సుదాకర్, మౌలాలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు ఇవ్వకుండానే ఊదరగొడుతున్నారు.

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరులో పేదలకు ఇళ్ళులు ఇవ్వకుండానే ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఊదరగొడుతున్నాడని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోపించారు. సోమవారం స్థానిక కొత్త పల్లె పంచాయతీలోని సుందరయ్య కాలనీ, జేమ్స్ కొట్టాలలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలకు ఆరు గ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేసి విశదీకరించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు , పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి ,కొత్తపల్లె మాజీ ఎంపీటీసీ పేట రమణ, ఉపసర్పంచ్ రమణ, వార్డు మెంబరు ఇస్మాయిల్, సుందరయ్యకాలనీ దేవదాసు రవి, ఇసాక్, తిరుపాలు, యోహాను, లక్ష్మీకాంత్, సునీల్, ప్రసన్న, ఖాసీం, దినేష్‌కుమార్‌పాల్గొన్నారు.

బద్వేలురూరల్ : చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళ మాచుపల్లె లక్ష్మీదేవి అన్నారు. సోమవారం 34వ వార్డులో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.


సోముల వారి పల్లెలో ప్రచారం చేస్తున్న ప్రవీణ్‌రెడ్డి


సార్వకట్టవీధిలో ప్రచారంచేస్తున్న సీఎం సురేష్ నాయుడు